క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో నీళ్ల ట్యాప్‌లు చోరీ



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల గ్రామ పరిధిలోని గణేష్‌పురం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వాటర్ ట్యాప్‌లను దొంగిలించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు ఈ మేరకు సమాచారం అందించారు. పాఠశాలకు సెలవులు రావడంతో ఇలాంటి వస్తువులు చోరీకి గురవుతున్నాయి. కొన్నిసార్లు ప్రాంగణంలో మద్యం తాగి సీసాలు పగలకొడుతున్నారు. బడికి ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కరకట్ట వెంట జంగిల్ క్లియరెన్స్



తాడేపల్లి రూరల్: కనకదుర్గ వారధి రేపల్లె కరకట్ట వెంట కార్పొరేషన్ పరిధిలోని విజయవాడ క్లబ్, ప్రాతూరు, చిర్రావూరు, రామచంద్రాపురం ప్రాంతాల్లో చెట్లు, మొక్కలు విపరీతంగా పెరిగాయి. కార్పొరేషన్ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో కమిషనర్ అలీం బాషా ఆదేశాల మేరకు కార్పొరేషన్ సిబ్బంది ఆరు కిలోమీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. మరో మూడు రోజుల పాటు ఈ పనులు కొనసాగించనున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఘనంగా ఏపీ అవతరణ దినోత్సవం



తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్ళం అంజిరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం అవతరణ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాతిరెడ్డి ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కోసం అమరజీవి ఎనలేని కృషి చేశారని, ఆయన పోరాటం చిరస్మరణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

తాడికొండ: సూపర్ సిక్స్ హామీలలో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత గ్యాస్ సిలిండర్ హామీని ప్రభుత్వం అమలు చేసిందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. తాడికొండ అడ్డరోడ్డు కూడలిలో కామాక్షి గ్యాస్ ఏజెన్సీలో ఏర్పాటు చేసిన ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్‌లు అందజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండల పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమరావతి మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన సాల్మన్ రాజు(23) గుంటూరులో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 30వ తేదీన ఉదయాన్నే ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై వెళ్లి రాత్రి 11:30 గంటల సమయంలో తిరిగి వస్తుండగా తాడికొండ మండలం మోతడక సాయిబాబా ఆలయం వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో బలమైన గాయాలు తగిలాయి. స్థానికులు 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ 1వ తేదీ తెల్లవారు జామున 1:22 సమయంలో మృతి చెందాడు. మృతుడి భార్య హెబ్సీబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జోజి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలో పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత మాట్లాడుతూ.. పేద రోగులకు ఆసరాగా ప్రభుత్వం నిలుస్తోందని అన్నారు. ఈమనికి చెందిన లోకం శ్రీదేవి, రేవేంద్రపాడుకు చెందిన కొల్లూరు బేబిరాణి, పెదపాలెం గ్రామానికి చెందిన మెల్లంపాటి లక్ష్మీప్రసన్నకు సాయం అందజేశామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో దీపావళి వేడుకలు

- వాకిళ్లను దీపాలతో అలంకరించిన మహిళలు
- పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు
- బాణసంచా కాల్చి సందడి చేసిన యువత



తాడేపల్లిలో ఇంటి ముందు దీపాలు ఏర్పాటు చేస్తున్న మహిళలు

తాడేపల్లి రూరల్: దీపావళి పండుగను గురువారం ప్రతి ఇంట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద ఎత్తున టపాసులు కాల్చారు. ముఖ్యంగా మహిళలు సాయంత్రం సమయంలో ఇంటి ముంగిట వివిధ ఆకారాల్లో దీపాలు వెలిగించారు. ఇంట్లో లక్ష్మీదేవి పూజ నిర్వహించారు. దీపావళి ముందురోజు భారీ వర్షం పడడంతో బాణసంచా వ్యాపారుల్లో కాస్త ఆందోళన నెలకొంది. గురువారం ఎండ రావడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. కొనుగోలుదారులు కూడా ఉత్సాహంగా వచ్చి టపాసులు తీసుకెళ్లారు. దీపావళి పండుగను బాణసంచా పేల్చి ఘనంగా నిర్వహించుకున్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో...

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులో వైఎస్సార్‌సీపీ, రైతు సంఘం నాయకులు వజ్రాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య విచ్చేశారు. ముందుగా పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన లక్ష్మీదేవి పటం వద్ద మండపంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకొనే పండుగ దీపావళి అని, చెడును పోగొట్టి మంచిని తీసుకొచ్చే ఈ పండుగను అందరూ ఘనంగా



స్వీట్లు అందిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి, అమరా నాగయ్య తదితరులు

చేసుకుంటారని దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పండుగ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అందరికీ సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ మేరీరాణి, మాజీ ఎంపీటీసీ రెడ్డిబత్తుల సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మరియబాబు, కుంచనపల్లి కొలనుకొండ పార్టీ అధ్యక్షులు మిరియాల రాంబాబు, నూతక్కి శ్రీను, ప్రభాకర్, శివయ్య, సాంబయ్య, జయరావు, సుబ్బారావు, పాములు, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి స్వీట్లు పంపిణీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ సిబ్బందికి సాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాగర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎ.విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దీపావళి సందర్భంగా తమ సాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ సిబ్బందికి స్వీట్లు ప్రతి ఏటా అందజేస్తున్నామని చెప్పారు. తమ ఫౌండేషన్ ద్వారా ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎం.రఫీ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న దయాసాగర్, వేదికపై పి.గౌతమ్ రెడ్డి

వైఎస్సార్ సీపీ నాయకుడు మేకతోటి దయాసాగర్

ఫిరంగిపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలలో పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేకతోటి దయాసాగర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత పి.గౌతమ్ రెడ్డి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దయాసాగర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ సభ్యత్వ నమోదుకు ఈనెల 6 ఆఖరితేదీ కావడంతో పట్టభద్రులు తమ ఓటు హక్కును త్వరగా నమోదు చేయించుకోవాలని కోరారు. గ్రామాల్లో పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించాలని కోరారు. గ్రామాల వారీగా సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. పి.గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ పూర్తిచేసిన యువతి యువకులు ఆన్‌లైన్‌లో తమ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాలన అంతా అస్తవ్యస్తంగా ఉందని, హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చలేదని, ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. జెడ్పీటీసీ డి.కత్తిరేణమ్మ, కె.చిన్నపరెడ్డి, డి.సురేష్, టి.చిన్న థామస్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణ, ఖాజావలి, ఇజ్రాయిల్, మస్తాన్‌వలి, రాము, అంజిరెడ్డి, మల్కియా, జి.కోటేశ్వరరావు, బాజీ పాల్గొన్నారు.

మేడికొండూరులో...

మేడికొండూరు: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ నేత మేకతోటి దయాసాగర్ అన్నారు. మండలంలోని పేరేచర్ల సెంటర్ వద్ద కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటు నమోదు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. వైఎస్సార్ సీపీ నేత పూనూరి గౌతం రెడ్డి పాల్గొన్నారు. దయాసాగర్ మాట్లాడుతూ నవంబర్ 6 వరకు ఓటరు నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. తాడికొండ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. గౌతం రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులలో వైఎస్సార్ సీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉందన్నారు. మేడికొండూరు మండల జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య. పాములపాటి జయరావు, షేక్ గాలిబీ, తమనంపల్లి శాంతయ్య. ఉడుత ప్రభాకర్ రావు, ఒంటేరు నాగురయ్య, ఒంటేరు వీరబ్రహ్మం, సంకు రత్తయ్య, షేక్ షరీఫ్, గోపి దేశి శ్రీను, లూర్దురాజు, కొక్కెర నాగేశ్వర రావు, రన్ను హుస్సేన్, షేక్ జానీ బాష, బీర్ల వెంకటేశ్వర్లు, ఆరిఫ్ పాల్గొన్నారు.

నిర్మల హృదయ్‌లో పండ్లు పంపిణీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని నిర్మల హృదయ్ అనాథ సేవ ఆశ్రమంలో శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిమ్మ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రేపూడి గ్రామానికి చెందిన మారెళ్ళ గంగిరెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా కేంద్రంలోని చిన్నారులకు పండ్లు, టవల్స్ అందజేసినట్టు తెలిపారు.

పొక్లెయిన్ స్వాధీనం

తాడికొండ: తుళ్ళూరు మండలం అబ్బరాజుపాలెం గ్రామంలో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక లోడింగ్ చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తుళ్ళూరు ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు. లోడింగ్ చేసుకుంటున్న రెండు లారీలు ఘటనా స్థలం నుంచి తప్పించుకోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: ప్రముఖ న్యాయవాది హరిదాస్ శివప్రసాద్ 8వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన తమ్ముడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. ముందుగా శివప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మామిడిబత్తుల సుబ్రమణ్యం, బండారు రవికాంత్, మట్టిపల్లి గోపాలకృష్ణ, గురివిశెట్టి శ్రీనివాస్, పోలిశెట్టి శివప్రసాద్, వై.శరత్, యార్లగడ్డ రవికుమార్, బండారు మధుసూదన్ పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి



కార్మికులతో మాట్లాడుతున్న ఏసీ లక్ష్మిపతి

తెనాలిఅర్బన్: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మిపతి సూచించారు. పట్టణంలోని 7,9,10,11, 36, 37 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డు లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణ సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయాలని సూచించారు. అనంతరం సచివాలయంకు వెళ్లి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కతారి హరీష్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో 10 మందికి బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: 4వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలి కెఎస్‌ఆర్ అకాడమికి చెందిన 10మందికి బంగారు పతకాలు, 9 మందికి వెండి పతకాలు, ముగ్గురుకు కాంస్య పతకా లు లభించినట్లు కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. పోటీలను అక్టోబర్ 26, 27 తేదీల్లో తెనాలిలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణ వెనుక ఉన్న వ్యాయామ మందిరంలో నిర్వహించినట్లు చెప్పారు. వీరికి గురువారం అకాడమీలో మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, అన్నవరపు సత్యం, ఆరాధ్యుల నాగరాజు, కె.కృష్ణ, చంటి, బాలు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొల్లిపర: మైనర్ బాలుడు అతివేగంగా స్కూటీ నడిపి ఎదురుగా మరో బైకు పై వస్తున్న యువకుడిని ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం రాత్రి కొల్లిపర బీసీ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దావులూరు గ్రామంలోని నాగరాజు పాలెంకు చెందిన గాజుల తేజ అనే యువకుడు కొల్లిపర నుంచి దావులూరుకి వస్తుండగా దావులూరు అడ్డరోడ్డు లో నివాసం ఉంటున్న కుటుంబానికి చెందిన మైనర్ బాలుడు అడ్డరోడ్డు నుంచి కొల్లిపర వైపునకు వెళ్తూ అతివేగంగా గాజుల తేజను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తేజకు తలకు బలమైన గాయమవడంతో ప్రాథమిక చికిత్స అందించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు 108 ద్వారా తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే మైనర్ బాలుడి అక్కడి నుంచి స్కూటీ వదిలివేసి భయంతో పారిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

నేటి నుంచి కార్తిక మాస పూజలు

- కార్తిక శోభను సంతరించుకున్న పెదపులివర్రు శివాలయం
- కాశీలో తరువాత పరస్పరం అభిముఖంగా శివ, వైష్ణవాలయాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): గ్రామంలో కొలువైన బాలా త్రిపురసుందరీ సమేత రాజరాజ నరేంద్రస్వామి (శివాలయం), భూనీళా సమేత వరదరాజస్వామి(వైష్ణవాలయం) దేవాలయాలకు ఒక విశిష్టత ఉంది. ఈ రెండు దేవాలయాలు పరస్పరం అభిముఖంగా ఉండటం విశేషం. ఇలా ఈ ఆలయాలు ఉత్తరాదిన కాశీలో, దక్షిణాదిన బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో ఉండటం గమనార్హం. స్వయంభుగా కొలువై నారద మహర్షియే నిత్య పూజలు అందుకున్న ఆ కై లాసనాథుని దివ్యానుభూతి రూపం రాజరాజ నరేంద్రస్వామిగా కొలువై భక్తులతో నిత్య అభిషేకాలతో ప్రసన్న రూపంతో కనువిందు చేయడం ఇక్కడి విశేషం. వ్యాఘ్రపాద మహర్షి ఆశ్రమం రాజరాజ నరేంద్రుని దృష్టిని ఆకర్షించిన పవిత్ర క్షేత్రం. వ్యాఘ్రపాద మహర్షి కోరికపై కంచి వరదరాజ స్వామి



పెదపులివర్రులోని రాజరాజ నరేంద్రస్వామి దేవాలయం

ఇక్కడ వెలిశారు. రామానుజాచార్యులు ఇక్కడ వైష్ణవ ఆలయంలో విడిది చేసి వరదరాజ స్వామిని సేవించడంతో ఈ క్షేత్రం పవిత్ర స్థలంగా ప్రసిద్ధి గాంచింది ఈ దేవాలయాన్ని 1512లో బెజవాడ సామ్రాజ్యాధి నేతలు పునఃప్రతిష్ఠించినట్లు ఈదేవాలయంలో శాసనాలు ఉన్నాయి. కార్తిక మాసం పురస్కరించుకుని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయమంతా కార్తిక శోభ సంతరించుకుంది. కార్తిక మాసంలో భక్తులు వేకువజామున ఆలయానికి తరలి వస్తుంటారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కార్తిక దీపారాధనలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. శివాలయంలో శనివారం నుంచి కార్తీక మాస దీక్షా అభిషేకాలు, నిత్య కల్యాణాలు, లక్ష బిల్వార్చన, అన్నాభిషేకం, పంచదారాభిషేకం, జ్వాలాతోరణం, సామూహిక కుంకుమ పూజలు, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాలు జరగనున్నాయి. పూజలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ నిర్వహిస్తుండగా కార్యనిర్వాహణాధికారి సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

అండర్-19 యోగాలో సత్తా చాటిన రావెల జడ్పీ విద్యార్థిని

త్వరలో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినితో ప్రిన్సిపాల్, ఆయుర్వేద వైద్యురాలు రేష్మ

రావెల(తాడికొండ): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని పేరుబోయిన వెంకట త్రివేణి బంగారు పతకం సాధించిందని రావెల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్‌వీ నాగమణి తెలిపారు. అక్టోబర్ 28-29 తేదీలలో అన్నమయ్య జిల్లా రాయచోటిలో నిర్వహించిన అండర్ 19 యోగా పోటీలలో పాల్గొని విజయం సాధించి బంగారు పతకానికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. త్వరలో మహారాష్ట్రలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థిని పాల్గొననుందని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పాఠశాలలో ఆయుష్ వైద్య విభాగం ఆధ్వర్యంలో శిక్షకుడు అన్నవరపు రాకేష్‌తో యోగా శిక్షణ అందిస్తున్నామని, గతంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పలు పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించగా ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని వెంకట త్రివేణి, యోగా గురువు అన్నవరపు రాకేష్‌లను హెచ్‌ఎం నాగమణి, ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ రేష్మ తదితరులు అభినందించారు. పీఈటీ జగదీశ్వరరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో ఇక్కట్లు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు పద్మశాలి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు కూడా పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్లు....

కార్పొరేషన్ పరిధిలో, దుగ్గిరాల మండలంలో ఉదయం 5 గంటల నుంచి సచివాలయ సిబ్బంది పెన్షన్లు అందజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం 5 గంటల సమయానికి కూడా 75 శాతం పూర్తి కాలేదు. ఒక్కొక్క లబ్ధిదారుడి వద్ద 10 నుంచి 15 నిమిషాలపాటు సమయం పట్టడం, సర్వర్లు మొరాయించడంతో పంపిణీకి ఇక్కట్లు ఏర్పడ్డాయని సిబ్బంది తెలిపారు.

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పింఛన్లు పంపిణీ ప్రక్రియను ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. రేపూడి, నుదురుపాడు గ్రామాలకు వెళ్లి పంపిణీ చేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. సాయంత్రానికి 90 శాతం పై పూర్తి కావాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

సర్వర్ మొరాయింపుతో అవస్థలు..

ఇదిలాఉండగా.. ఉదయం ఆరుగురికి పింఛన్లు ఇచ్చిన తరువాత సర్వర్ మొరాయించింది. దీంతో పింఛను లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటల వరకు సర్వర్ సేవలు అందకపోవడంతో వృద్ధులు, ఇతర లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. 2 గంటల తర్వాత పింఛన్ల పంపిణీని మళ్లీ ప్రారంభించారు.

అష్టలక్ష్మి అమ్మవారికి ధనలక్ష్మి పూజ



దర్శించుకున్న భక్తులు



తెనాలి: ఆశ్వయుజ బహుళ అమావాస్య దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో ధనలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. రూపాయి నాణేలకు పూజ చేసి భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేశారు. పండగ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ద్వాదశ హారతులు, మంగళవాయిద్యాలతో ఆలయం శోభాయమానంగా వెలుగొందింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. దండిస్వాముల ఆశీర్వాదంతో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీరామచక్రవర్తి పూజలను నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాన్ని తెనాలి ప్రాంతంలో కేవలం అష్టలక్ష్మి దేవాలయంలోనే జరుగుతాయని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఎన్నికలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం భీమిరెడ్డి తాతిరెడ్డి మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు డాక్టర్ గుర్రం సురేష్ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించడానికి మాక్‌పోల్ నిర్వహించామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ స్కూల్ ఎం.ఎల్.ఎస్‌గా గరిష్ఠంగా 34 ఓట్లతో గెలిచిన అభ్యర్థి పి.మేఘన (9ఎ తరగతి) పేరును ప్రకటించామని, ఈమాక్ పోలింగ్‌లో 15 మంది అభ్యర్థులు పోటీ చేశారని,



ఓటుహక్కు వినియోగించుకున్న విద్యార్థులు

నోటాతో కలపి బ్యాలెట్ పేపరును ముద్రించామని తెలిపారు. అనంతరం విజేతను, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగి గ్రామ సమీపంలో కృష్ణా నదిలో ఇసుక కోసం వచ్చిన ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది దీనిపై స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా



గాయాల పాలైన డ్రైవర్ శివ

ఉన్నాయి. గుంటూరు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కట్టా శివ మున్నంగి గ్రామం సమీపంలో కృష్ణానది లోకి ఇసుక కోసం వస్తుందిగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి పక్కన ఉన్న కాలువలోకి దూసుకు వెళ్ళింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాలతో పాటు డ్రైవర్ కు ఎడమ కాలు విరిగినట్లు తెలుస్తుంది. దీంతో అక్కడ ఉన్న గ్రామస్తులు 108 కు స్థానిక



కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

పోలీసులకు కాల్ చేసి సమాచారం అందించారు దీంతో సంఘటన స్థలానికి ఎస్సై పి కోటేశ్వరరావు చేరుకొని ప్రమాదానికి గల కారణాలు పరిశీలించి కేసు నమోదు చేసి డ్రైవర్ని మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎండీయూ ఆపరేటర్‌పై కేసు నమోదుకు ఆదేశం

తెనాలిరూరల్: మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ ఆపరేటర్‌పై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఆదేశించారు. తెనాలిలో జరుగుతున్న రేషన్ పంపిణీని శుక్రవారం ఆయ న ఆకస్మికంగా తనిఖీ చేశారు. చినరావూరులో ఎనిమిదవ నంబరు ఎండీయూలో రేషన్ పంపిణీ జరిగిన వివరాలకు, వాహనంలో ఉన్న బియ్యంకు 450 కిలోలు వ్యత్యాసం ఉండడంతో వాహన ఆపరేటర్ కిరణ్‌పై కేసు నమోదు చేయాలని సీఎస్‌డీటీ మూర్తిని ఆదేశించారు. అలానే ఐతానగర్‌లో తొమ్మిదో నంబరు రేషన్ దుకాణానికి కేటాయించిన ఎండీయూ వాహనాన్ని తహసీల్దార్ రాకను పసిగట్టిన ఆపరేటర్ వాహన తలుపులన్నీ మూసేసి వెళ్లిపోయాడు. దీనిపైనా విచారించి నివేదిక సమర్పించాలని సిబ్బందిని ఆదేశించారు. రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదని తహసీల్దార్ హెచ్చరించారు.